
క్లుప్తంగా

సూర్యప్రభ వాహనంపై వీరేశ్వరుడు



సూర్యప్రభ వాహనంపై భద్రకాళీ సమేత వీరేశ్వరుడు

ఐ.పోలవరం: నిత్యకళ్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు మూడో రోజు వైభవంగా జరిగాయి. శైవాగమ పద్ధతిలో స్వర్ణ రుద్రాక్ష కంకణ, స్వర్ణ సింహతలాట సన్మాన గ్రహీత, రాష్ట్ర ఆదిశైవ అర్చక సంఘ అధ్యక్షుడు యనమండ్ర సత్యసీతారామ శర్మ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు జరుగుతున్నాయి. బుధవారం ఆలయంలో ఉదయం గవ్యాంతము, పంచవింశతి కలశ స్థాపన పూర్వక అభిషేకం, సరస్వతి హోమం, రుద్రహోమం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన 'సూర్యప్రభ' వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. పచ్చిపూలతో స్వామి, అమ్మవార్ల అలంకరణ భక్తులను ఆకట్టుకొంది. ఈ ఉత్సవాలలో భక్తులకు అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లను ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ పర్యవేక్షిస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలోని విద్యుత్ లైన్ల అభివృద్ధి పనుల నిమిత్తం అడివిపాలెం, దొమ్మేటిపేట, సీతారామనగర్, దరియాలతిప్ప, జీఎంసీ బాలయోగి కాలనీ, గిరియాంపేట, సావిత్రినగర్ గ్రామాల్లో గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఏఈ లంక కృష్ణారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

టైలరింగ్‌లో మెళకువలపై మహిళలకు శిక్షణ

తాళ్లరేవు: రిలయన్స్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో మహిళా సాధికారత కార్యక్రమంలో భాగంగా మహిళలకు టైలరింగ్‌లో మెళకువలపై శిక్షణనిచ్చారు. బుధవారం గాడిమొగలోని రిలయన్స్ కమ్యూనిటీ హాలులో ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని రిలయన్స్ ప్రతినిధి సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. కార్యక్రమంలో కాకినాడ పడాల చారిటబుల్ ట్రస్ట్ రిసోర్స్‌పర్సన్స్ మహిళలకు టైలరింగ్ మోడల్స్, మిషన్ ప్రాబ్లమ్స్‌పై అవగాహన కల్పించారు.

స్లూయిజ్ నిర్మించాలంటూ వినతి

ఐ.పోలవరం: ఓఎన్‌జీసీ భారీ వాహనాల రాకపోకల వల్ల గ్రామంలో ఉన్న స్లూయిజ్ పాడైపోయిందని, దాని స్థానంలో కొత్త స్లూయిజ్ నిర్మించాలని జి.మూలపొలం గ్రామస్తులు కోరారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. దీనిపై ఎమ్మెల్యే పొన్నాడ మాట్లాడుతూ స్లూయిజ్ పరిస్థితి తెలుసుకొనేందుకు అధికారులను పంపి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

ఉప్పలగుప్తం: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు అన్నారు. మండలంలోని గొల్లవిల్లి, భీమనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో వేదాంత కెయిర్న్ సంస్థ సమకూర్చిన స్పోర్ట్స్ కిట్లను విద్యార్థులకు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు సంపదరావు చేతుల మీదుగా ఒక్కొక్క పాఠశాల విద్యార్థులకు 20 వాలీబాల్‌లు, 5 నెట్‌లు, 50 క్రీడాదుస్తులు, 50 జతల బూట్లు వితరణగా అందజేశారు.

ఓల్డేజ్‌హోమ్‌కు రూ.30 వేల చెక్కు అందజేత

యానాం: యానాం వృద్ధాశ్రమానికి ఎన్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లాడి శామ్యూల్ తన భార్య మల్లాడి సత్యవాణి జ్ఞాపకార్థం బుధవారం రూ.30 వేల చెక్కును హోమ్ నిర్వాహకుడు పెసల గంగయ్యకు అందజేశారు. అనంతరం వృద్ధులకు అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. కోరంగి వృద్ధులు, అనాథాశ్రమంలో పండ్లు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ మల్లాడి దత్త వెంకటావిష్, మల్లాడి హర్షరామ్‌నితీష్ పాల్గొన్నారు.

సైన్స్ పార్క్ ఏర్పాటుచేయాలి

యానాం: యానాం జవహర్ నవోదయ విద్యాలయలో సైన్స్ పార్క్ ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉందని ఆర్‌ఏఓ మునిస్వామి పేర్కొన్నారు. బుధవారం స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో విద్యాలయ మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన విద్యాలయలో చేపడుతున్న విద్యాభివృద్ధి కార్యక్రమాలు, కరిక్యులర్ కార్యక్రమాల అమలును పరిశీలించి ప్రిన్సిపాల్ టీపీఎస్ ప్రకాశరావును అభినందించారు. విద్యార్థులు తయారుచేసిన హ్యాండీక్రాఫ్ట్‌ను, అందంగా వేసిన రంగవల్లులను ఆయన ఆసక్తిగా తిలకించారు. విద్యార్థులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడానికి నవోదయ విద్య ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ సమావేశంలో ప్రాంతీయ పరిపాలనాధికారి పంపన లక్ష్మణ్ ప్రవీణ్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వరుగు భాస్కరరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంతర పంటలు.. ఆర్థిక భరోసా..

- తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం
- లాభాలు ఆర్జిస్తున్న కొబ్బరి రైతులు

ముమ్మిడివరం: కొబ్బరితోటల్లో అంతర పంటలుగా వివిధ రకాల కూరగాయలు, ఇతర పంటలు సాగు చేస్తూ పలువురు రైతులు లాభాలను ఆర్జిస్తున్నారు. వాణిజ్య పంటలకు దీర్ఘకాలం పెట్టుబడులు పెట్టాల్సి ఉండటంతో రైతులు అదనపు ఆదాయ వనరుగా అంతర పంటలను సాగు చేస్తున్నారు. వాణిజ్య పంటల రైతులు మార్కెట్‌లో ఫలసాయం అందే సమయంలో ప్రకృతి వైపరీత్యాలతో పంటను కోల్పోవడం, గిట్టుబాటు ధర లభించక తీవ్రంగా నష్టపోతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా అంతర పంటలు వేసుకుంటున్నారు. అవి అన్నదాతలకు ఆర్థికంగా భరోసా కల్పిస్తున్నాయి.

అంతర పంటలుగా విభిన్న రకాలు

వాణిజ్య పంటలైన అరటి, కొబ్బరి, కంద, పసుపు, జామ సాగు భూముల్లో బెండ, మిరప, ఆకుకూరలు, వంగ వంటి విభిన్న పంటలతో పాటు పూల సాగును సైతం అంతర పంటలుగా వేస్తున్నారు. వాణిజ్య పంటలు వేసిన నాటి నుంచి ఫలసాయం అందడానికి 9 నుంచి 11 నెలల సమయం పట్టడంతో రైతులు అప్పటి వరకూ పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. ఈ ఏడాది అరటి పంటకు గిట్టుబాటు ధర ఉన్నా దిగుబడి లేకపోవడంతో ఆదాయం అంతంత మాత్రంగానే వచ్చింది. దీంతో ఈ తోటల్లో అరటి, కోకో, కూరగాయలు సాగు చేస్తున్నారు.



గాడిలంకలో కొబ్బరితోటలో అంతర పంటగా కూరగాయల సాగు



కొబ్బరి తోటలో అంతర పంటగా కొబ్బరి మొక్కల పెంపకం

ఎన్నో లాభాలు

ముమ్మిడివరం వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో సుమారు 2,017 హెక్టార్లలో అంతర పంటలు సాగవుతున్నాయి. ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన మండలాల్లోని పలు గ్రామాల్లోని రైతులు అంతర పంటల సాగుకు మొగ్గు చూపిస్తున్నారు. వాణిజ్య పంటలకు ఏడాది పొడవునా పెట్టుబడి అవసరం. అదే అంతర పంటలకైతే సాగు పెట్టుబడి తక్కువ.

పైగా ఎక్కువ ఆదాయం, కలుపు బెడద నివారణ కారణంగా రైతులపై ఆర్థిక భారం తగ్గుతుంది. అంతర పంటలతో కేవలం 45 రోజుల్లోనే ఫలసాయం పొంది లాభాలు ఆర్జించొచ్చని రైతులు చెబుతున్నారు. కూరగాయల సాగుతో క్రమం తప్పని ఆదాయం లభిస్తోందని రైతులు చెబుతున్నారు.

అంతర పంటలతో లాభాలు

మా కొబ్బరి తోటలో అంతర పంటగా కూరగాయలు, పెసలు, పిల్లి పెసర వంటి పంటలను సాగు చేస్తున్నాను. వాటికి నీటి అవసరం, ఎరువుల ఖర్చు, పెట్టుబడి తక్కువ. అంతర పంటల సాగుతో లాభాలు బాగుంటున్నాయి.

– కొమ్మిరెడ్డి శ్రీనివాసరావు, రైతు, గాడిలంక

తెగుళ్లను తరిమేయొచ్చు

అంతర పంటగా పూల సాగు చేపడితే అక్కడకు వచ్చే మిత్ర పురుగులు క్రిమికీటకాలను ఆహారంగా తీసుకుంటాయి. దీనివల్ల వాణిజ్య పంటలకు తెగుళ్లు ఆశించవు. పైగా పంట మార్పిడి వల్ల భూసారం పెరుగుతుంది.

– ఎస్.ప్రశాంతకుమార్, ఏఓ, ముమ్మిడివరం

నవరత్నాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి

- ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్
- అల్లవరంలో గడప గడపకూ మన ప్రభుత్వం

అల్లవరం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నవరత్నాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుస్తుందని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. బుధవారం అల్లవరం పాలెంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, మంత్రి విశ్వరూప్ కుమారుడు శ్రీకాంత్ నిర్వహించారు. వారిద్దరూ గ్రామంలో ఇంటింటికీ వెళ్లి గత నాలుగేళ్లుగా ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మాట్లాడుతూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయలేనన్ని సంక్షేమ పథకాలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేశారని ఇజ్రాయిల్ అన్నారు. అనంతరం అల్లవరం పాలెం, అల్లవరం ప్రాంతాల్లో శ్రీకాంత్ ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై లబ్ధిదారుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, గృహ సారథుల కన్వీనర్ తిక్కా ప్రసాదు, సర్పంచ్ బొమ్ము బాలవేణి, ఎంపీటీసీ నిచ్చెనకోళ్ల మౌనిక, సొసైటీ చైర్మన్ యల్లమిల్లి బోసు, తదితరులు పాల్గొన్నారు



సంక్షేమ పథకాల లబ్ధి వివరాలను అందజేస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, శ్రీకాంత్

స్వచ్ఛంద సేవలను విస్తృతం చేయాలి

ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్

యానాం: ప్రజలకు స్వచ్ఛంద సేవలు అందించడమే లక్ష్యంగా ఏర్పడిన లయన్స్ క్లబ్ యానాం పిల్లారాయ తమ సేవలను విస్తృతం చేయాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక పార్వతీశ్వరమ్మ మినీ గార్డెన్స్‌లో లయన్స్‌క్లబ్ యానాం పిల్లారాయ నూతన క్లబ్ కార్యవర్గం ప్రమాణస్వీకారోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్‌అశోక్ మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల సమయంలో కుల మతాలకతీతంగా సేవా దృక్పథమే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. అనంతరం క్లబ్ నూతన అధ్యక్షుడిగా పులవర్తి వెంకటరమణమూర్తి(శ్రీను), కార్యదర్శిగా డీవీవీ సత్యనారాయణ, ట్రెజరర్‌గా సతీష్‌చంద్ర, బెజవాడ నిరంజనరావు, కాకి నాగేశ్వరరావు, సాయిచరణ్‌కుమార్, సీహెచ్ సత్యనారాయణ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఏఓ మునిస్వామి, డిస్ట్రిక్ట్ గవర్నర్ మార్టూరు మంగతాయారు, డీవీఎస్‌రాజు, లింగమల్లు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



లయన్స్‌క్లబ్ సర్టిఫికెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తదితరులు

శ్మశానవాటిక వివాదంలో ఉద్రిక్తత

ఉప్పలగుప్తం: మండలంలోని ఎస్.కొత్తపల్లి గ్రామంలో గత కొన్ని రోజులుగా జరుగుతున్న శ్మశానవాటిక భూమి వివాదంలో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. గ్రామంలోని వానపల్లిపాలెం రెవెన్యూ పరిధిలో ఆక్రమించారంటూ గ్రామస్తులు ఆరోపిస్తున్న భూమి తనదేనని, దీనిపై కోర్టు ఆదేశాలిచ్చినట్లుగా సదరు స్థలంలో రైతు కోలా నరసింహమూర్తి బోర్డు పెట్టారు. సదరు భూమిలో రైతు నాటిన కొబ్బరి చెట్లను జేసీబీ, చెట్ల కోత యంత్రాల సహాయంతో గ్రామస్తులు బుధవారం నేల కూల్చారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ వై.మాధవరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలతో మాట్లాడి చర్చల నిమిత్తం వారందరినీ అమలాపురం ఆర్డీవో కార్యాలయానికి తీసుకెళ్లారు. ఆర్డీవో వసంతరాయుడు ఇరువర్గాలతో చర్చించారు. కొంత సమయమిస్తే రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌తో చర్చించి రైతు వద్ద భూసేకరణ చేసి శ్మశాన వాటికకు సదరు స్థలం ఇచ్చేలా చేస్తామని గ్రామస్తులకు ఆర్డీవో నచ్చజెప్పారు. అప్పటివరకూ ఎటువంటి తొందరపాటు చర్యలకు ఇరువర్గాలు పాల్పడొద్దని హెచ్చరించారు.



ఎస్.కొత్తపల్లిలో యంత్రాలతో చెట్లను పడగొడుతున్న గ్రామస్తులు

పుదువై కలైమామణి అవార్డుకు నలుగురు ఎంపిక



వరుగు భాస్కరరెడ్డి



ముమ్మిడి వీరనాగప్రసాద్



గ్రంధి సత్యనారాయణ



కోరుకొండ ప్రసాదరావు

యానాం: పుదుచ్చేరి కళలు, సాంస్కృతిక శాఖ రాష్ట్రవ్యాప్తంగా కళారంగాల్లో విశేష కృషి చేసినవారికి ఇచ్చే ప్రతిష్ఠాత్మకమైన పుదువై కలైమామణి అవార్డుకు ఈసారి యానాం నుంచి నలుగురిని ఎంపిక చేస్తూ పుదుచ్చేరి ప్రభుత్వం బుధవారం నిర్ణయం తీసుకుంది. సాహితీ రంగం నుంచి స్థానిక సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి, నాటకరంగం నుంచి విశ్రాంత జేఈ కోరుకొండ ప్రసాదరావు, చిత్రకళా రంగం నుంచి స్థానిక రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ ఫైన్ ఆర్ట్స్ టీచర్ ముమ్మిడి వీరనాగప్రసాద్, శిల్ప రంగం నుంచి అద్దాలపై అద్భుతమైన కళాఖండాలు చెక్కే ఎన్‌గ్రేవింగ్ సీనియర్ ఆర్టిస్ట్ గ్రంధి సత్యనారాయణ అవార్డుకు ఎంపికయ్యారు. వారికి ఈ నెల 29న పుదుచ్చేరిలో సీఎం రంగసామి చేతుల మీదుగా అవార్డులు ప్రదానం చేయనున్నారు. అవార్డుకు ఎంపికైనవారికి ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్, ఆర్‌ఏఓ మునిస్వామి అభినందనలు తెలియజేశారు.

దివ్యాంగులకు తోడ్పాటునందించాలి

జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం రూరల్: విభిన్న ప్రతిభావంతులైన దివ్యాంగులు వైకల్యాలను అధిగమించేందుకు తోడ్పాటునందించాలని సమన్వయ కమిటీ బాధ్యత వహించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో అధికారులతో జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ దివ్యాంగుల పాఠశాలల్లో మెట్లతో పాటు ర్యాంపులను కచ్చితంగా నిర్మించాలన్నారు. వికాస విభాగం ద్వారా ఉద్యోగాల కల్పనలో దివ్యాంగులకు రిజర్వేషన్లు అమలుపరచాలని ఆదేశించారు. విభిన్న ప్రతిభావంతులైన ఉద్యోగులు చేసిన అప్పీళ్లను పరిశీలించి మానవతా దృక్పథంతో న్యాయం చేకూర్చాలన్నారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలో వైకల్యాలున్న వ్యక్తుల కోసం రిజర్వేషన్ల ప్రకారం దివ్యాంగుల పడకలు ఏర్పాటు చేయాలన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల్లో దివ్యాంగుల కోటాను తప్పనిసరిగా అమలుచేయాలని సూచించారు. క్రీడా అభివృద్ధి శాఖ ద్వారా వికలాంగుల కోసం ప్రాంతీయ క్రీడా అకాడమీని ఏర్పాటు చేయాలన్నారు. దివ్యాంగుల సంక్షేమానికి రాజ్యాంగబద్ధంగా బాధ్యతతో పనిచేసేందుకు జిల్లా ఎస్పీ కార్యాలయంలో సింగిల్ పాయింట్ ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, డీసీహెచ్‌ఎస్ పద్మశ్రీ రాణి, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడీఏ వి.కామరాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, చిత్రంలో ఎస్పీ శ్రీధర్

వసతి గృహంలో మౌలిక సదుపాయాలకు చర్యలు

ఉప్పలగుప్తం: గొల్లవిల్లి సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో మౌలిక సదుపాయాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఎస్.యానం రవ్వ ప్లాంట్ యాజమాన్యం వేదాంత కెయిర్న్ సంస్థ అధికారులు తెలిపారు. గొల్లవిల్లి సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని వేదాంత కెయిర్న్ ఏవో ఎం.శివరామకృష్ణ, సీఎస్‌ఆర్ మేనేజర్ ఎస్.ఎం పాషాలు బుధవారం సందర్శించారు. వసతిగృహం వెనుక భాగంలో కాంపౌండ్ వాల్ మెరక చేయడంతో పాటు సోలార్ లైట్లు ఏర్పాటు చేయాలని జెడ్పీటీసీ సంపదరావు కోరారు. మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ, బడుగు గణేష్, వీరవల్లి చినబాబు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు చిత్తశుద్ధి లేదు



వన్నె చింతలపూడిలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

అమలాపురం రూరల్: విజన్–2045 పేరుతో మోదీ విధానాలతో తాను ఏకీభవిస్తున్నట్లు టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు రిపబ్లిక్ టీవీ చర్చల్లో చెప్పడం చూస్తే ఆయనకు రాష్ట్రం పట్ల, రాష్ట్ర అభివృద్ధి పట్ల, ప్రజల సంక్షేమ పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి లేదని అర్థమవుతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అభిప్రాయపడ్డారు. అమలాపురం మండలం వన్నె చింతలపూడిలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పచ్చిమాల వసంతకుమార్ సంస్మరణ సభలో పాల్గొనేందుకు వచ్చిన శ్రీనివాసరావు విలేకరులతో మాట్లాడారు. మోదీ విధానాలు దేశాన్ని సంక్షోభంలో నెట్టాయని, ఆ విధానాలతో విభేదం లేనట్టు చంద్రబాబు చెప్పటం మోసగించడమేనన్నారు. మన రాష్ట్రానికి ప్రత్యేక హోదా విభజన హామీలపైనే మోదీతో విభేదిస్తున్నట్లు చెబుతున్న చంద్రబాబు గత నాలుగేళ్లుగా కనీసం దాని మీద ఎలాంటి ఉద్యమాలు నడపలేదన్నారు.

నూరు శాతం అమలుచేయాలి

అల్లవరం: పీహెచ్‌సీ పరిధిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న ఆరోగ్య కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో నూరు శాతం అమలుచేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా వైద్యాధికారి దుర్గారావు దొర అన్నారు. గోడిలంక పీహెచ్‌సీ ఆవరణలో వైద్యాధికారి సుమ ఆధ్వర్యంలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై జిల్లా వైద్యాధికారి దుర్గారావు దొర, జిల్లా ఇమ్యూనిషేన్ అధికారి టీకే శ్రీనివాసరావు మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ గర్భిణుల వివరాలన్నీ క్రమం తప్పకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో గోడిలంక వైద్యాధికారి సుమ, బెండమూర్లంక వైద్యాధికారి శాంతి, సూపర్‌వైజర్లు సుధాకర్, ఎంపీహెచ్‌ఈఓ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక అభివృద్ధికి ప్రతిపాదనలు

అమలాపురం టౌన్: జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి సమగ్ర ప్రతిపాదనలకు రూపకల్పన చేసి పూర్తి స్థాయిలో నివేదికలు సమర్పించాలని ఆ శాఖ అధికారులకు కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలో పర్యాటక రంగ అభివృద్ధి అంశంపై ఆ శాఖ అధికారులతో బుధవారం జరిగిన సమావేశంలో కలెక్టర్ శుక్లా మాట్లాడారు. జిల్లాలో పలుచోట్ల టూరిజం అథారిటీ అధికారులు సూచించిన స్థలాల సేకరణ సాధ్యాసాధ్యాలపై కలెక్టర్ శుక్లాతో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర చర్చించారు. ఓ అండ్ ఎం ప్రాజెక్ట్‌లు, కొత్త టూరిజం ప్రాజెక్ట్‌లపై సమీక్షించారు. దిండి, పాశర్లపూడి నదీ పాయల్లో బోటింగ్ కార్యకలాపాలు, గోగులంక వద్ద కోనసీమ పర్యాటక ప్రాజెక్ట్‌కు భూమి ప్రతిపాదన తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

టెంపుల్ టూరిజం అభివృద్ధిపై చర్చ

జిల్లాలోని టెంపుల్ టూరిజం అభివృద్ధిపైనా సమావేశంలో కలెక్టర్ శుక్లా లోతుగా చర్చించారు. జిల్లాలో చారిత్రాత్మక దేవాలయాలైన అంతర్వేది, అయినవిల్లి, వాడపల్లి, అప్పనపల్లి, ర్యాలి, మందపల్లి తదితర దేవస్థానాల వద్ద టూరిజం ప్రగతిపై సమీక్షించారు. అంతర్వేది, చింతలమోరి, ఓడలరేవు, ఎస్.యానాం బీచ్‌ల అభివృద్ధిపై చర్చించారు. కోనసీమ నదీ పరీవాహక ప్రాంతాల్లో ఎంపిక చేసిన చోట్ల బోటింగ్ టెర్మినల్స్ ఏర్పాట్లపై అధ్యయనం చేయాలన్నారు. డీఆర్వో సీహెచ్ సత్తిబాబు, జిల్లా టూరిజం అధికారి వెంకటాచలం, హోటల్ యజమానులు, బోటింగ్ యాజమానులు ఈ సమీక్షలో పాల్గొన్నారు.

పార్టీ కార్యకర్తకు ఆర్థిక సాయం

తాళ్లరేవు: అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న కోరంగి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ కార్యకర్త పోల్నాటి వీర్రాజు కుటుంబానికి ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ రూ.5,000 ఆర్థిక సాయంతో పాటు నిత్యావసర సరకుల్ని అందజేశారు. బుధవారం ఆయన వీర్రాజు ఇంటికి వెళ్లి పరామర్శించి నగదుతో పాటు బియ్యం, కిరాణా సరకుల్ని ఇచ్చారు. వీర్రాజు పరిస్థితిని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లి ఆదుకుంటామన్నారు. ఆయన వెంట చిట్టూరి చలపతి, కుడుపూడి మల్లేష్, బొంతు శ్రీను తదితరులున్నారు.

ఎంఆర్‌పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా మోహన్

అల్లవరం: అమలాపురం నియోజకవర్గ ఎంఆర్‌పీఎస్ ఇన్‌చార్జ్‌గా గోడి గ్రామానికి చెందిన ఆకుమర్తి మోహన్ ఎన్నికయ్యారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లాల ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ అనుబంధ సంఘాల సమావేశం మండలంలోని మొగళ్లమూరులో జరిగింది. ఎంఎస్‌పీ ఇన్‌చార్జ్ లూటుకుర్తి చిన్న అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు యార్లగడ్డ సత్తిబాబు, సవరపు భైరవమూర్తి, జిల్లా ఉపాధ్యక్షుడు ఆకుమర్తి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల పట్టాభిషేకం

అల్లవరం: బెండమూర్లంకలో కొలువైన కోదండ రామాలయంలో సీతారాముల పట్టాభిషేకం అత్యంత వైభవంగా నిర్వహించారు. మూడు రోజులుగా జరుగుతున్న సీతారామస్వామికి పట్టాభిషేకం కార్యక్రమాలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆల్డా చైర్మన్ యాళ్ల దొరబాబు దంపతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు వంటెద్దు వెంకయ్యనాయుడు దంపతులు కల్యాణం నిర్వహించారు. అనంతరం స్వామివారికి గ్రామోత్సవం జరిపారు.

పాఠశాలలను తనిఖీ చేసే అధికారం పీఎంసీలదే

అమలాపురం రూరల్: పాఠశాలలను తనిఖీ చేసే అధికారం పాఠశాలల తల్లిదండ్రుల కమిటీకే ఉంటుందని ఎంఈఓ గుబ్బల సూర్యప్రకాశం అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మండలంలోని ప్రధానోపాధ్యాయులకు పాఠశాలల సామాజిక తనిఖీపై శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఎంఈవో గుబ్బల సూర్యప్రకాశం అధ్యక్షతన జరిగిన శిక్షణ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ సీహెచ్‌వీవీ నందం పాఠశాలల్లో సమగ్ర అభివృద్ధికి సంబంధించిన సమాచారాన్ని యాప్‌లో నమోదు చేయాలన్నారు.





